LV Prasad Eye Institute

# శుక్ల నిర్వహణలో పురోగతి – స్పష్టమైన మరియు సురక్షిత దృష్టి వాగ్దానం

***శుక్లాలు ఏర్పడటం అర్థం చేసుకోవడంనుంచి శుక్ల నిర్వహణలో తాజా పురోగతులను అన్వేషించడంవరకూ – అన్నీ తెలుసుకోండి!***

***జూన్ నెల శుక్ల అవగాహనా మాసంగా గుర్తించబడింది***

- కంటిలోపల వయో-సంబంధితంగా వచ్చే మార్పులు సాధారణంగా శుక్లానికి ప్రధాన కారణం
- మధుమేహం, కిడ్నీ వ్యాధి, గ్లకోమా, కంటి గాయాలు, ఇన్ఫెక్షన్లు, కంటిలోపల ఇన్ఫ్లమేషన్, కొన్ని ప్రత్యేక మందుల దీర్ఘకాల వాడకం, మరియు ధూమపానంవంటి ఇతర కారకాలుకూడా శుక్లం పెరగడానికి దోహదం చెయ్యవచ్చు
- కొన్ని కేసులలో, నవజాత శిశువులు లేదా చాలా చిన్నపిల్లలలో జన్యుపర లేదా జీవక్రియ సంబంధిత లోపాలవలన, అలాగే ఇన్ఫెక్షన్లు లేదా గాయాలవలన శుక్లం రావచ్చు
- చదవడం లేదా వాహనం నడపడంవంటి కార్యకలాపాలకు కళ్ళద్దాలు అవసరమైనప్పటికీ, దృష్టిని పునరుద్ధరించడానికి శుక్ల శస్త్రచికిత్స ఒక్కటే ప్రభావవంతమైన పరిష్కారం
- శుక్ల శస్త్రచికిత్సలో ఇటీవలి కొన్ని పురోగతులు శుక్లాన్ని పరిష్కరించడమేకాక, ప్రక్రియ తరువాత కళ్ళద్దాలు లేదా కాంటాక్ట్ లెన్సుల అవసరాన్ని తొలగించగలుగుతూ దృష్టి సమస్యలను సరిచేస్తాయికూడా.
- శుక్లాన్ని తొలగించిన తరువాత, అది తిరిగిరాదు. అయినప్పటికీ, కొందరు రోగులకు కాలానుగతంగా మసకచూపు రావచ్చు. దీనిని ఆనుషంగిక శుక్లం అంటారు. ఈ స్థితికి సాధారణ లేజర్ ప్రక్రియతో చికిత్స చేయవచ్చు.
- శుక్ల శస్త్రచికిత్సలో పురోగతులున్నప్పటికీ, పునరుద్ధరించలేని దృష్టి హానికి దారితీయగలవాటితో సహా సమస్యలను నివారించడానికి సూక్ష్మత మరియు సంరక్షణను నిర్ధారించడం చాలా ముఖ్యం. అందువలన, అనుభవజ్ఞుడైన ఆప్థల్మాలజిస్ట్ నేతృత్వంలోని బృందం శస్త్రచికిత్సను నిర్వహించడం అత్యంత ఆవశ్యకం.

ప్రపంచవ్యాప్తంగా అంధత్వానికి ఒక ప్రధాన కారణం శుక్లం. కానీ, మంచి వార్త ఏమిటంటే, శుక్లంవలన వచ్చే అంధత్వాన్ని చూపును పునరుద్ధరించడంలో సహాయపడగల సాధారణ శస్త్రచికిత్సలతో నివారించవచ్చు.

పరిపూర్ణమైన దృష్టికోసం కాంతి ప్రసరించగలిగే విధంగా లెన్స్ స్పష్టంగా ఉండాలి. లెన్స్ మసక లేదా అపారదర్శకం అయినప్పుడు, కాంతి దానిద్వారా ప్రసారించలేదు, ఫలితంగా చూపు అస్పష్టమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణంగా చేసే ప్రక్రియలలో ఒకటైన శుక్ల శస్త్రచికిత్సలో సహజ పారదర్శక లెన్సు ఇంట్రాఆక్యులర్ లెన్స్ (ఐఓఎల్)

అనబడే ఒక కృత్రిమ లెన్సుతో మార్పిడి చేయబడుతుంది. శుక్లం శస్త్రచికిత్స సమగ్ర విజయం రేటు 98% మించిపోయింది. సాంకేతిక పరిజ్ఞానాలు మరియు పరికరాలలో నిరంతర ఆవిష్కరణలు ప్రక్రియను గతంలో కంటే సులభతరం మరియు సురక్షితమైనవిగా చేశాయి.

శుక్లం ప్రారంభ దశలలో కళ్ళద్దాలు మార్చడం కొంత సహాయపడవచ్చు. అయినప్పటికీ, శుక్లం పెరుగుతున్నకొద్దీ, శస్త్రచికిత్స మాత్రమే ఆచరణీయ ఎంపికగా మిగులుతుంది.

"చాలామంది శుక్లాన్ని తొలగించడానికి అది పూర్తిగా ముదరాలని నమ్ముతారు. కానీ, ఇది ఇక నిజంకాదు. శుక్ల శస్త్రచికిత్స సురక్షితమైనది, ఊహించగల ప్రక్రియ. తగ్గిన చూపు వ్యక్తి దైనందిన జీవితాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తున్నట్లయితే, దీనిని చేయవచ్చు," అన్నారు **డా వివేక్ ఎం సింగ్, కన్సల్టెంట్, కల్లం అంజిరెడ్డి ప్రాంగణం, ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, హైదరాబాద్.**

"శుక్ల శస్త్రచికిత్సా విధానాలలో చెప్పుకోదగిన పురోగమనాలు ఉన్నప్పటికీ, అత్యంత నైపుణ్యం కలిగిన సర్జన్లు ఉండికూడా సమస్యలు తలెత్తగలవని గుర్తించడం చాలా ముఖ్యం. సమస్యలకు సాధారణ కారణాలలో కఠిన కంటి నిర్మాణం, తీవ్రమైన శుక్లాలు, సర్జనుకు అనుభవం లేకపోవడం మరియు భద్రతా నిబంధనలను పాటించడంలో వైఫల్యం ఉన్నాయి. జటిలతలకు అదనంగా, శస్త్రచికిత్స అనంతర సంరక్షణ లేకపోవడం చూపుకు హాని చేయగల తీవ్రమైన కంటి ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని పెంచుతుంది. అందువలన, శుక్ల శస్త్రచికిత్స సమయంలో అది నిర్దుష్టతతో జరిగేటట్లు నిర్ధారిస్తూ మరియు శస్త్రచికిత్స అనంతర సమయంలో అత్యంత జాగ్రత్త తీసుకుంటూ అప్రమత్తతకు ప్రాధాన్యత ఇవ్వడం చాలా ముఖ్యం." అని ఉద్ఘాటించారు **డా వివేక్ ఎం సింగ్.**

**కారణాలు:** వృద్ధాప్య కారణంగా క్షీణత మార్పులు శుక్లం రావడానికి అత్యంత సాధారణ కారణం. వయస్సుతో, సహజ లెన్సులోని ప్రోటీన్ క్షీణిస్తుంది. దీని ఫలితంగా మసకబారిన లెన్సును శుక్లం అంటారు. అయినప్పటికీ, శుక్లాలు మధుమేహం, కిడ్నీ వ్యాధి, గ్లకోమా, కంటి ఇన్ఫెక్షన్లు, ఇన్ఫ్లమేషనుతోపాటు కంటి గాయాలు మరియు కొన్ని ప్రత్యేక మందుల దీర్ఘకాల వాడకంవంటి అంతర్లీన ఆరోగ్య స్థితులవలనకూడా రావచ్చు. ధూమపానం మరొక దోహదపడే కారకం. అదనంగా, కాలుకూడా శుక్లం పెరగడానికి దోహదం చెయ్యవచ్చు. అదనంగా, జన్యు లేదా జీవక్రియ లోపాలు, ఇన్ఫెక్షన్లు లేదా గాయం కారణంగా శిశువులు లేదా చిన్న పిల్లలలో కంటిశుక్లం సంభవించవచ్చు.

**లక్షణాలు:** కంటిగుడ్డు మబ్బుగా కనిపించడం, అస్పష్టమైన చూపు, ద్వంద్వ దృష్టి, రాత్రి చూపు సరిగా లేకపోవడం, మిరుమిట్లుగొలిపే కాంతి కారణంగా వాహనం నడపడంలో ఇబ్బంది, రంగుల కాంతివలయాలు మరియు మసక వెలుతురులో చదవడంలో ఇబ్బందివంటి వివిధ లక్షణాలతో కంటిశుక్లం కనిపిస్తుంది. కంటిలో తెల్లగా కనిపించడం (ల్యూకోకోరియా), మెల్లకన్ను మరియు కనుగుడ్లు అసంకల్పితంగా కదలిపోవడంవంటి లక్షణాలు పిల్లలలో ఉండవచ్చు.

**లెన్స్ ఎంపికలు:** మీ నేత్ర వైద్యుడు మీ ఆరోగ్య స్థితి, జీవనశైలి, వృత్తి మరియు వ్యక్తిగత ప్రాధాన్యతలను మూల్యాంకనం చేసి మీకు అత్యంత సముచితమైన లెన్స్ ఎంపికను నిర్ణయిస్తారు. అందుబాటులో ఉన్న లెన్స్ ఎంపికలు నిరంతరం ముందుకు సాగుతున్నాయి. మోనోఫోకల్ లెన్స్‌లు దూరదృష్టిని సమర్థవంతంగా సరిచేయగలవు, అయితే మల్టీఫోకల్ లెన్స్‌లు దూరదృష్టిని పరిష్కరించడమే కాకుండా చదవడానికి ఉపయోగించే కళ్ళద్దాల అవసరాన్ని కూడా తొలగిస్తాయి. కాంతి రెటీనాపై సరిగ్గా కేంద్రీకరించక, ఫలితంగా వక్రీకరించిన దృష్టి (అస్టిగ్మాటిజం) ఏర్పడిన సందర్భాల్లో, టోరిక్ మోనోఫోకల్ లేదా టోరిక్ మల్టీఫోకల్ లెన్స్‌లను సూచించవచ్చు.

**శుక్ల శస్త్రచికిత్స**: సాధారణంగా ఉపయోగించే శస్త్రచికిత్సా ప్రక్రియలు మూడు ఉన్నాయి:

**ఫాకోఎమల్సిఫికేషన్:**

- ఇది శుక్లాలకు చేసే అత్యంత సాధారణ శస్త్రచికిత్స
- ఇందులో ఒక చిన్న గాటు చేయబడుతుంది (2.2-3.2మిమీ)
- ప్రారంభదశ శుక్లాలకు ఇది ప్రధాన ఎంపిక.

**స్మాల్ ఇన్సిషన్ కాటరాక్ట్ సర్జరీ (ఎస్ఐసిఎస్):**

- ఈ ప్రక్రియలో పెద్దగాటు చేయబడుతుంది (6-7 మిమీ).
- కఠినమైన మరియు తీవ్రమైన శుక్లాలకు ఇది ప్రధాన ఎంపిక

**ఫెంటో సెకండ్ లేజర్ కాటరాక్ట్ సర్జరీ:**

- ఇది అధునాతన కంటిశుక్ల శస్త్రచికిత్సలో ప్రక్రియ క్లిష్టమైన దశలలో అధిక నిర్దుష్టత మరియు భద్రతను అందిస్తున్న తాజా పురోగతి.
- టోరిక్ మరియు మల్టీఫోకల్ వంటి ప్రీమియం లెన్సులను పెట్టించుకోదలచుకున్న వ్యక్తులకు ఇది ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది.

శుక్ల శస్త్రచికిత్స తరువాత, రోజువారీ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించేముందు కనీసం ఏడురోజుల విశ్రాంతి తీసుకోవాలని సిఫార్సు చేయబడింది. అయితే ఇది వ్యక్తిగత పరిస్థితులపై ఆధారపడి మారవచ్చు. స్వస్థత పొందే సమయంలో, కొన్ని కాంతిప్రసార పరిస్థితుల్లో మిరుమిట్లుగొలపడం మరియు కాంతివలయాలవంటి (కాంతి మూలాల చుట్టూ వలయాలు) దృశ్య అవాంతరాలను మీరు అనుభవించవచ్చు. ఈ ప్రభావాలు సాధారణమైనవి మరియు సాధారణంగా కాలక్రమేణా తగ్గుతాయి.